క్లుప్తంగా

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం



నెల్లూరు(బారకాసు) : మూలాపేటలోని బ్రాహ్మణవీధిలో ఉన్న గురు నిలయంలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి స్వామివారికి హోమగుండం, విశేషాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ ఆశ్రమాల నుంచి విచ్చేసిన పీఠాధిపతులు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఆశ్రమ నిర్వాహకుడు గోపి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సన్మానం



నెల్లూరు (టౌన్) : జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో పనిచేస్తూ ఆర్టీఓలుగా పదోన్నతి పొందిన వారికి ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు సోమవారం సన్మానం చేశారు. బీవీనగర్‌లోని కార్యాలయంలో ఎంవీఐగా పనిచేస్తూ పదోన్నతి పొందిన కె.మురళీమోహన్, ఏఓగా పనిచేస్తూ పదోన్నతి పొందిన బీఎస్‌కే కిశోర్ రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయంలో వారిని సన్మానించారు. అనంతరం డీటీసీ బి.చందర్ ఇరువురు అధికారులకు అభినందనలు తెలిపారు. కె.మురళీమోహన్ తిరుపతి ఆర్టీఓగా, కిశోర్ గూడూరు ఆర్టీఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్, బాబు, ఏఎంవీఐలు స్వప్నిల్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, రంగనాథరెడ్డి, ఏఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



నెల్లూరు(క్రైమ్) : అనారోగ్యంతో గుర్తుతెలియని యువకుడు(25) ఈనెల 6వ తేదీ నుంచి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుని వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ నంబర్ 0861-2328440, 94407 00018లకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య విజ్ఞప్తి చేశారు.

డయల్ యువర్ డీఎం-1 రేపు

నెల్లూరు సిటీ : నెల్లూరు ఆర్టీసీ డిపో-1 పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సూచనలకు సంబంధించి ఈనెల 11వ తేదీన(రేపు) సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25641 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చేయిచేసుకున్నాడని ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్) : ఓ వ్యక్తిపై చేయిచేసుకున్న ఘటనపై చిన్నబజారు పోలీసులు విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వనం-మనం కార్యక్రమంలో భాగంగా శోధన్‌నగర్‌లో సోమవారం చెట్ల వద్ద శుభ్రం చేస్తుండగా నాకు తెలియకుండా మీరెవర్రా చేసేందుకంటూ మాజీ కార్పొరేటర్ రాజేష్ తనపై చేయిచేసుకున్నాడని అదే ప్రాంతానికి చెందిన రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

భక్తులకు అన్నదానం

నెల్లూరు(బారకాసు) : నగరంలోని గిడ్డంగి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, జేఎల్.సత్యం, ప్రమోద్, దువ్వూరు సుభాష్ పాల్గొన్నారు.

సంతపేటలో..

నగరంలోని సంతపేట వద్ద ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు, రేవతి, చందు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో సందడి

తోటపల్లిగూడూరు: కోడూరు సాగర తీరంలో సోమవారం వేళాంగణిమాత భక్తులు సందడి చేశారు. వేళాంగణిమాత (మరియమాత) జన్మదిన ఆరాధనోత్సవాలు ముగిశాయి. ఆదివారం రాత్రి ఆలయంలో రాత్రి జాగరణ చేసిన వేలాది మంది భక్తులు సోమవారం తెల్లవారు జామున కోడూరు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం వేళాంగణిమాతను దర్శించుకున్నారు.

నీరు లేక.. సాగు చేయలేక

- ఐదేళ్ల తరువాత కరువు పంజా
- బీడుగా మారుతున్న పొలాలు



బీడుగా ఉన్న పొలం

నెల్లూరు(సెంట్రల్) : ఉత్తరాంధ్రలో అతివృష్టితో పంట పొలాలు, గృహాలు నీట మునుగుతున్నాయి. అయితే జిల్లాలో తాగునీటికే ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాకు ఆయుపట్టుగా ఉన్న సోమశిల జలాశయంలో ప్రతి ఏటా ఈ సమయానికి దాదాపుగా 60 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. అయితే ప్రస్తుతం 46 టీఎంసీల నీరు ఉండడంతో తాగునీటికే ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపుగా 60 టీఎంసీలు ఉంటేనే అటు తాగునీటికి, ఇటు సాగునీటి విడుదలకు అవకాశం ఉంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితిలో వరుణుడు కరుణిస్తేనే సాగు చేయగలమని రైతులు అంటున్నారు.

ఐదు సంవత్సరాల తరువాత..

2019 నుంచి గతేడాది వరకు జిల్లాలో ప్రతి రబీ సీజన్ నాటికి సోమశిల జలాశయం నిండుకుండలా ఉండేది. దీనికి తోడు జిల్లాలోని 1,746 చిన్న తరహా చెరువుల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో వాటి కింద 3 లక్షల ఎకరాల్లో సాగు జరిగేది. అదేలా మధ్య తరహా చెరువులు 104 ఉండగా వీటి కింద 30 వేల ఎకరాలు, పెద్ద చెరువులు 68 ఉండగా వీటి కింద మరో లక్ష ఎకరాల్లో సాగు చేస్తుండేవారు. ఇవన్నీ దాదాపుగా సోమశిల జలాశయంలో నీరు ఉంటే ఈ చెరువులు కూడా నిండుకుండలా ఉండేవి. వీటితో పాటు బోర్లలో కూడా నీరు ఉండడంతో అటు పెన్నా డెల్టా ద్వారా, ఇటు బోర్ల ద్వారా జిల్లా మొత్తం సాగు చేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు కనుమరుగయ్యాయి.

కౌలు రైతులు దూరం

జిల్లాలో దాదాపుగా రబీ సీజన్‌లో 5 లక్షల ఎకరాల్లో సాగు జరిగేది. వీటితో పాటు 2 లక్షల ఎకరాల్లో కౌలు రైతులు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం నీటి లభ్యత లేకపోవడంతో కౌలు రైతులు సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం 50 వేల నుంచి 75 వేల ఎకరాల్లో సాగు చేసే పరిస్థితి మాత్రమే కనిపిస్తోంది.

భరోసా నిల్

ప్రతి ఏడాది రబీ సీజన్ ప్రారంభానికి ముందు వైఎస్సార్ రైతుభరోసా పేరుతో గత ప్రభుత్వం రైతు ఖాతాల్లో పెట్టుబడి కింద నగదు సాయం చేసేది. అటు సాగునీరు, ఇటు పెట్టుబడి సాయం సకాలంలో వస్తుండడంతో రైతులు కూడా ముందుకొచ్చి సాగు చేసే పరిస్థితి ఉండేది. ప్రధానంగా గతంలో కౌలు రైతులకు ప్రత్యేక కార్డులు అందజేసి భరోసా నగదు ఇస్తుండడంతో వారు ధైర్యంగా పొలానికి వెళ్లే వారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రైతులను ఆదుకునే నాథుడే కరువయ్యారు. తూతూ మంత్రంగా ప్రభుత్వం తొమ్మిది రకాల విత్తనాలు అందిస్తోంది. జిల్లాలో 2.50 లక్షల మంది రైతులు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితులు ఇంకా తక్కువగా ఉంది.

వర్షాలు పడితే అప్రమత్తం చేస్తాం



వర్షాలు లేకపోవడంతో గత ఖరీఫ్‌లో కూడా పెద్దగా సాగు లేదు. ఈ రబీలో వర్షాలు పడితే రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం తరఫున అప్రమత్తం చేస్తాం. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలను కొంత మంది రైతులకు అందిస్తున్నాం. సోమశిల జలాశయంలో నీటి లభ్యత ఆధారంగా జిల్లాలో చాలా చోట్ల సాగు ఉంటుంది.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సోమశిలకు నీరు వస్తేనే..



సోమశిలలో నీరు వస్తే మా ప్రాంతంతో పాటు జిల్లాలో సాగు బాగుంటుంది. సోమశిల జలాశయంపైనే రైతాంగం ఆశలు పెట్టుకుని ఉంది. ప్రభుత్వం కూడా ఆదుకోవాలి.

– బ్రహ్మారెడ్డి, రైతు, డీసీపల్లి

వరద బాధితులకు ఆర్థిక సాయం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఏపీఎన్‌జీజీఓస్ సభ్యులు

నెల్లూరు(దర్గామిట్ట) : విజయవాడ వరద బాధితులకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన కుమారుడు మాగుంట నిఖిల్‌రెడ్డి నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో సోమవారం కలిసి రూ.5 లక్షల చెక్కును అందజేశారు.

- ఏపీ ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో రూ.1,00,116ల చెక్కును కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు ఎస్.ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మధు, జిల్లా సంయుక్త కార్యదర్శి ఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

17న ఏపీఈజేయూ జిల్లా మహాసభ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట) : ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా నాలుగో మహాసభ ఈనెల 17వ తేదీ జరుగనున్న సందర్భంగా దానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉడత రామకృష్ణ, రాష్ట్ర కో-కన్వీనర్ గట్టుపల్లి శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు సరశమ్మ, షేక్ రిజ్వాన్, కలికి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యుల నిరసన ర్యాలీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కోల్‌కతా ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై హత్యాచారం జరిగి నెల రోజులు గడిచినా బాధిత కుటుంబానికి న్యాయం జరగలేదంటూ నెల్లూరు నగరంలో వైద్యులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ గైనకాలజిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు నగరంలోని గైనకాలజిస్టులు నిరసన ర్యాలీ చేపట్టామన్నారు. వైద్యురాలిపై హత్యాచారం ఘటనలో పారదర్శక విచారణ జరిపి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్, సుప్రజ, చైతన్య, హారిక, పలు సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

వేధిస్తున్న విద్యుత్ కోతలు

- అనధికారిక అంతరాయాలతో అల్లాడుతున్న ప్రజలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా పలు ప్రాంతాల్లో కరెంట్ ఎప్పుడు పోతుందో తెలియక విద్యుత్ వినియోగదారులు హడలిపోతున్నారు. ప్రధానంగా విద్యుత్‌శాఖ అధికారులు అధికారికంగా ప్రతి నెలా రెండో శనివారం విద్యుత్‌లైన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ (మరమ్మతులు), విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాలు చేపడుతూ, వినియోగదారులకు ముందుగా పత్రికా ప్రకటన రూపంలో సమాచారాన్ని అందిస్తుంటారు. అదేవిధంగా కొన్ని సందర్భాల్లో ఆదివారాలు, శనివారాల్లో సైతం మెయింటెనెన్స్ చేస్తూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుంటారు. అయితే ఈ విధంగా అధికారికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతుంటే అనధికారికంగా పలు ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒక సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పాత విద్యుత్‌లైన్లకు ఉన్న వైర్ల (కండక్టర్) స్థానంలో నూతన కండక్టర్‌ను మార్చకపోవడం, అదనపు విద్యుత్ లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అదనపు సామర్థ్యం కలిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయకపోవడం, త్రీ ఫేస్ సప్లయ్ కాకుండా సింగిల్‌ఫేస్ విద్యుత్ లైన్లు ఉండడం, విద్యుత్ లైన్లపై ఉడతలు, పక్షులు, కోతులు లాంటివి పడిన సందర్భాల్లో ఫీడర్ ట్రిప్ అయిన సందర్భాల్లో సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం ఎక్కడో ఒకచోట ఏదో ఒక సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో 20 నిమిషాల నుంచి గంట పాటు కూడా అంతరాయాలు ఉంటోంది. అయితే కొన్ని ప్రాంతాల్లో అధికారికంగా ప్రకటించే అంతరాయాల కంటే అనధికారిక విద్యుత్ అంతరాయాలే ఎక్కువగానే ఉంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరాలో అనధికార అంతరాయాలను తగ్గించి విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన అవసరం ఉంది.

వృద్ధుడిపై దాడి

నెల్లూరు(క్రైమ్) : వృద్ధుడిపై దాడి ఘటనకు సంబంధించి నవాబుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బోడిగాడితోటలో శేఖర్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమారుడికి అదే ప్రాంతానికి చెందిన చక్రితో విభేదాలున్నాయి. ఇటీవల వారు గొడవ పడగా శేఖర్ వారించి ఇద్దరినీ మందలించారు. దీంతో కోపోద్రిక్తుడైన చక్రి తన స్నేహితులైన బాలాజీ, రవి, గబ్బు, రాజు, అజయ్, మరికొందరితో కలిసి ఈనెల 8వ తేదీ రాత్రి శేఖర్ ఇంట్లోకి ప్రవేశించి అతనిపై దాడిచేసి గాయపరిచారు. దీంతో ఆయన జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

డీకేడబ్ల్యూలో భరతేందు హరిశ్చంద్ర జయంతి

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో హిందీ పితామహుడు బాబు భరతేందు హరిశ్చంద్ర 175 జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అద్దంకి కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ ఎంవీ సత్యనారాయణ భరతేందు హరిశ్చంద్ర జీవితం, సాహిత్య సేవలను వివరించారు. అనంతరం ఎంవీ సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణారావు, హిందీ విభాగాధిపతి డాక్టర్ సురేంద్ర, తెలుగు విభాగం ప్రొఫెసర్ కేవీ సత్యనారాయణ, ఉర్దూ ప్రొఫెసర్ మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు పదవులు ఇవ్వడం సిగ్గుచేటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పార్టీ కోసం ఎలాంటి త్యాగాలు, పోరాటాలు చేయని అనర్హులకు పదవులు ఇవ్వడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్ ఆరోపించారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన వారిని, ఎస్సీలను విస్మరించి అర్హత లేని వారికి పీసీసీ చీఫ్ షర్మిల జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిని చేవూరు దేవకుమార్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని ఉడతా వెంకట్రావ్ యాదవ్‌లకు ఇచ్చారన్నారు. సీనియర్ నాయకులు అయిన సీవీ శేషారెడ్డి, రఘురామ్ ముదిరాజ్ లాంటి వారు పార్టీని వీడేందుకు కారణమైన వ్యక్తికి రాష్ట్ర పదవి ఇవ్వడం సమంజసం కాదన్నారు.

గాయపడిన ఇద్దరి మృతి

ఇందుకూరుపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చిట్టేడు గ్రామానికి చెందిన రాజేష్(24), ఆవుల శ్యామ్ వెంకట్(24) మృతిచెందినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 7వ తేదీన ఆవుల శ్యామ్ వెంకట్, ఆవుల దినేష్, రాజేష్ ముగ్గురు కలిసి తోటపల్లిగూడూరు మండలంలోని ముంగళదొరువుకు వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కొత్తూరు చింతోపు వద్ద లారీ ఢీకొట్టడంతో రాజేష్, శ్యామ్ వెంకట్‌లకు తీవ్రగాయాలు కాగా, దినేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా ఆదివారం రాత్రి శ్యామ్ వెంకట్ మృతిచెందగా, సోమవారం రాజేష్ మృతిచెందినట్లు ఎస్సై వివరించారు. దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

హెచ్చరికలున్నా పట్టించుకోలేదు

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు సిటీ : వాతావరణ శాఖ, నీటిపారుదల విభాగం ముందుగానే ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసినా చంద్రబాబు పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడారు. వాతావరణ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదన్నారు. వరదలు వచ్చిన తరువాత కూడా ప్రభుత్వం నుంచి కనీస వసతులైన ఆహారం, నీరు అందించడంలో విఫలమయ్యారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే 50 మంది తమ ప్రాణాలు వదలాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని ధ్వజమెత్తారు. వర్షం, వరద తగ్గుముఖం పట్టిన తరువాత కూడా కనీస వసతులకు నోచుకోని పరిస్థితి ఉందన్నారు. దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారని నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల ఎనిమిది రోజుల పాటు లక్షల మంది ప్రజలు నరకయాతన అనుభవించారని తెలిపారు. చంద్రబాబు అధికారులను వెంట వేసుకుని తిరగడం తప్ప వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి పర్యవేక్షించే ప్రయత్నం చేయలేదన్నారు. రోజుకు మూడు నాలుగు సార్లు ప్రెస్‌మీట్‌లు పెట్టి అంతా తానే చేస్తున్నట్లు భ్రమ కల్పించే ప్రయత్నం చేశారే తప్ప వారికి మేలు చేసే పనులు చేయలేదన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- అదనపు కమిషనర్ శర్మద



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

నెల్లూరు(బారకాసు) : ప్రజలు తెలుపుతున్న సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రీవెన్స్ కార్యక్రమానికి సకాలంలో హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముందు వారం అందిన అర్జీలపై సమీక్ష చేస్తామన్నారు. ప్రతి అర్జీ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. సోమవారం ప్రజల నుంచి 19 ఫిర్యాదులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ ఇనాయతుల్లా, ఎస్ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవీకుమారి, టీపీఓ దశయ్య, ఆర్వోలు శ్రీనివాసులు, సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

- రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నెల్లూరు సిటీ : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకుడు పొట్టేపాళెం చంద్రమౌళి, రైతు సంఘం నాయకులు పూడిపర్తి జనార్దన్, పాదర్తి మస్తానయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అనేక మోసపూరిత వాగ్దానాలు చేశారన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని, కనీస మద్దతు ధరను చట్టం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. ఇంతవరకు అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కౌలు రైతులను ఆదుకుంటామని, రూ.20 వేల సాయం ఇస్తామని వాగ్దానం చేసి మోసం చేశారన్నారు. జిల్లాలో లక్ష మంది కౌలు రైతులు ఉంటే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులను గ్రామసభల ద్వారా ఎంపిక చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు అమర్చడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సోమశిల ఆప్రాన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు, అట్లా అనిల్, రైతు సంఘం నాయకులు మల్లె సింహగిరి, గుడి రవీంద్ర, జానా లక్ష్మీప్రసాద్, కౌలు రైతు సంఘం నాయకులు ఎడవల్లి రమణయ్య, పేరతూరు నాగరాజు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి తరలిరావాలి



ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : ఈనెల 11వ తేదీన సామూహిక నిమజ్జనానికి తరలిరావాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి సమీపంలో ఘాట్ వద్ద ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవదాయ శాఖ సహాయ సహకారాలతో 14 దేవస్థానాల ప్రసాదాలను భక్తులకు వితరణ చేస్తామని వెల్లడించారు.

మంచి ఆలోచనలతో సాగుదాం



ర్యాలీ చేస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, వలంటీర్లు

నెల్లూరు(అర్బన్) : ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా మంచి ఆలోచనలతో ధైర్యంగా ముందుకు సాగితే విజయాలు తథ్యమని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ కామేశ్వరి అన్నారు. ప్రపంచ సూసైడ్ ప్రివెన్షన్ డేను పురస్కరించుకుని నగరంలోని హైవే సమీపంలో ఉన్న యలమవారి దిన్నె అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆత్మహత్యలు సరికాదంటూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చింతారెడ్డిపాళెం, చెన్నకేశవాలయం, క్యాథలిక్ ప్రైమరీ స్కూల్, సరస్వతీ దేవాలయం తదితర ప్రాంతాల్లో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతీ, యువకులు సత్ప్రవర్తన అలవరుచుకోవాలన్నారు. ప్రతి మనిషి గౌరవంగా బతకాలని, పక్కవారికి సాయపడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వీడీ ప్రసూనకుమారి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ఎన్‌బీటీ కాలనీ, ప్రగతి నగర్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న టీబీ నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. వయోజనులకు వేస్తున్న టీబీ నివారణ వ్యాక్సిన్ గురించి ఆరాతీశారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందించారు.